ఏకాంకరూపిక :

కవి రచించిన స్వాతంత్ర్యగీతాలు

రచన: శ్రీ రావులపర్తి భద్రిరాజు.

1 వ దృశ్యం

[ఆగస్టు 15 వ తేది. ఉదయం, 7 గంటలు. ఊరంతా స్వాతంత్ర్య దినోత్సవాలతో పెళపెళ్లాడుతోంది. కవిగారి యిల్లు. కవి గుర్రుపెట్టి నిద్రపోతూంటాడు. కవి భార్య సూర్యలక్ష్మి వాకిలి ఊడుస్తూ భర్తను లేపడానికి వస్తుంది.]

సూర్యలక్ష్మి: ఏమండోయ్...మిమ్మల్నే. ఏడుగంటలైనా యింకా లేవరా ఏమిటి? (వీపు తట్టుతుంది.)

కవి: (ఆవలిస్తూ బద్ధకంగా లేచి) అబ్బబ్బా, తెల్లారిందో లేదో ఇప్పుడేం కొంప మునిగిందని చీపురుకట్టతో ఎదురుగా రావాలి?

సూర్య: బాగానే ఉంది మీ తోటి... మీరేగా పెందరాళే లేపమన్నది? మళ్ళా కేకలు కూడా ఎందుకు?

కవి: మరి తెల్లారకుండా చీపురు చేత్తో పుచ్చుకుని నా కళ్లబడొద్దని ఇది ఎన్నోసారి చెప్పడం?

సూర్య: దాసీమనిషి రాందే...నాకు తప్పుతుందా ఈ చాకిరీ.

కవి: ఏమిటి, దాసీది రానేలేదూ! ఏం వచ్చింది దానికి?...దాని దుంపతెగా!

సూర్య: రాలేదు.

కవి: ఎంచేతంటావు?

సూర్య: (కోపంగా) ఏమో! ఎంచేతో... రమ్మని కబురంపండీ!

కవి: ఆఁ...అదీ సంగతి...మనకి ఈవాళ స్వాతంత్ర్యం వచ్చిందికదూ, అంచేత దానిక్కూడా శెలవు. ఈ రోజున అన్ని ఆఫీసులూ, దుకాణాలతోబాటు దానికీ శెలవే! దేశమంతా సంతోషంగా పండగ చేసుకుంటూ రీవాళ, విన్నావా?

సూర్య: ఇంతకీ నాకే యీ రోజున శెలవు లేకపోతె. కానివ్వండి. (విసుగ్గా, వాకిలి ఊడుస్తున్న చప్పుడు వినబడుతుంది.)

కవి: లక్ష్మీ, యిలారా...కోపం ఎందుకు? ఈవాళ ఉత్సాహంగా ఉండాలి. ఆ చేతులోది అవతల పారెయ్యి ముందు...ఊఁ...అది నీ చేతిలో ఉండదగిన వస్తువు కాదు. ఇలా వొచ్చికూచో, (దగ్గర కూచోబెట్టుకుంటాడు)

సూర్య: సరిపోయింది...ఇలా కూచుంటే పాచిమొహాన్ని పన్లెలా జరుగుతాయండీ?

కవి: పన్లకేం; వాటంతటవే జరుగుతాయిగాని, కూచో ఓ సంగతి చెబుతా. (సూర్యలక్ష్మి కవి ప్రక్కనే కూర్చుంటుంది) గాంధీగారేం చెప్పారో తెలుసా! మనకి లభించే స్వాతంత్ర్యం చిరస్థాయిగా ఉండటానికి యీవాళ దేవుడికి భక్తితో పూజలు పునస్కారాలూ చేసి శాకపాకాలతో ఉగాదిలా జరుపుకోమన్నారు యావన్మంది భారతీయుల్నీ కూడా.

సూర్య: అయితే మనింట్లో కూడా పండగన్నమాటే!

కవి: కాకేం...దివ్యంగా...చూడూ... ఈ మధురక్షణంలోనే స్వతంత్రభారతిమీద నాలుగు పద్యం ముక్కలుకూడా రాసేసుకుని తరించాలని చూస్తున్నా.

సూర్య: ఈ అడావిళ్లో మీరు పద్యాలు కూడా రాస్తారూ!

కవి: ఆఁ ......ఏమైనా సరే రాసుకు తీరాలి. అంచేత నువ్వు ఆ కాఫీ దేవతని త్వరగా తయారు చెయ్యాలి. ఈలోగా నేను గోదావరికి వెళ్లి అవశిష్టాలన్నీ తీర్చుకుని పుష్పాలతో పది నిమిషాల్లో చక్కావస్తా.

(ఇద్దరూ నిష్క్రమిస్తారు)

2 వ దృశ్యం

[కవి సావిట్లో టేబిల్ ముందు కుర్చీలో కూర్చుని ఏదో రాయబోతూ కాఫీకోసం ఎదురుచూస్తూంటాడు]

కవి: (స్వగతం) ఇంకా కాఫీ లేదు, నాంధా లేదు..... అబ్బే, అక్షరం ముక్కైనా కాగితంమీద పడ్డం లేందే వేళకి కాసిన్ని కాఫీనీళ్లు పొట్టలో పడితేగాని కుదురుగా క్షణం కూర్చోలేము—అదేం శాపమోగాని. (కాసేపు యిటు అటు చూసి) అబ్బ, యింకా రాదేం చెప్మా! (బిగ్గరగా) ఇదిగో..... నిన్నే ......ఏం చేస్తున్నావు లోపల......తొందరగా రావాలి.

సూర్య: ఒస్తున్నా (లోపలినుంచి సన్నగా వినిపిస్తుంది).........ఇదిగో కాఫీ.

కవి: అమ్మయ్య! యిలా తే.....కాఫీ తేవడానికి ఇంత ఆలస్యమా?

సూర్య: మీరు ఆలస్యంగా వచ్చారు, చల్లారిపోతుందని ఇప్పుడే కాచాను.

కవి: ఏమో గాని, వేళకి కాస్త కాఫీ పడితేగాని ఏ పనీ చెయ్యలేం కదా!......ఇదిగో, ఈ రోజుల్లో కాఫీ తాగనివాడుంటాడా? అందులోనూ కవిగాళ్లకి కాఫీ అంటే కల్పతరువే. కాఫీలోనే ఉంది కవిత్వంకూడా. (వేడి కాఫీ ఊదుకుంటూ తాగుతున్న చప్పుడు) కాఫీ అంటే కవిత్వాన్ని ప్రసాదించేదన్నాడు మా కవి సోదరుడొకడు. బాగా చెప్పాడు. నేడు అక్షరాలా ఆచరించేదే అది. అంచేత కవి అనేవాడు కాఫీ తాగి తీరాలి. (కాఫీ పూర్తిచేసి, గ్లాసు బల్లమీద పెట్టిన చప్పుడు)......... చూడూ, వంట ప్రయత్నం ఏమిటి?

సూర్య: ఏం వండమన్నారో చెప్పండి, అట్టే నాన్పక.

కవి: ఇవాళ పిండివంట బొబ్బట్లుట, చూసొక్కమరి, నీచేతి బొబ్బట్లు తిని చాలా కాలమైంది. అవైతే కవిత్వంకూడా ఆ పాకాన్నే పడి జనరంజకంగా ఉంటెదూ!

సూర్య: చాల్చాలు ఊరుకోండి...... ఏమిటా మాటలు! ఎవళ్లయినా వింటే నవ్వుతారు. ఇంట్లో గోధుంపిండి లేందే బొబ్బట్లెలా చెయ్యను చెప్పండి?

కవి: పోనీలే యింత గోడ వెందుకు, గార్లు కానీ.

సూర్య: సరే లెండి, అవి ఎలాగో చేస్తాను, గుంటూరునించి సుబ్బారాయణగారొచ్చారుట్టేమిటి? ఏం పనిమీద ఒచ్చాడో, మనింటికి రానేలేదు సుమండీ!

కవి: ఇందాక నేను గోదావరినుంచి వస్తూంటే కనబడ్డాడుగా!

సూర్య: కనపడి ఏమన్నాడేమిటి?

కవి: ఏముంది, మళ్లీ మామూలు ధోరణే. వాళ్ల మనమరాల్ని మాతమ్ముడికి చేసుకోమని కాల్పుకు తింటున్నాడు.

సూర్య: పిల్ల, చీకట్లో కళ్లు పొడుచుకున్నా కనపడదు. ఎందుకొచ్చిన పెళ్లండీ.

కవి: అదీ నిజమే......గంటన్నర సేపు రోడ్డుమీద నిలబెట్టి ఇదే గొడవ. ఎలాగో ఆ ఘటాన్ని ఒదుల్చుకు వొచ్చేసరికి కళప్రాణం తోక్కొచ్చింది......ఇవాళ ఏదో నాలుగక్షరాలు ముక్కలుకొక్కడా శెలవుగదా, పద్యాలో దిబ్బో రాసుకోవచ్చనుకుంటే ఏదో ఒకటి అడ్డం వస్తూనే ఉంది......ఊఁ. (విసుగ్గా మూలుగుతాడు)

సూర్య: మరో మంచిసంబంధం చూడండి, అతనూ పెళ్లికి సిద్ధంగా ఉన్నాడు.

కవి: సరేలే, ఇంక రాసుకోవాలి, నువ్వు గేటు తలుపులు గడియవేసి లోపలికి వెళ్లు. అప్పుడే పదిన్నర. మన వేణుగాడెక్కడికి పోయాడూ?

సూర్య: చంద్రశేఖరంగారి పిల్లల్తో ఆడుకుంటున్నాడు.

కవి: సరే, వస్తాడులే నీపని చూడు.

సూర్య: (మౌనంగా వెడుతుంది; తలుపు గడియవేసిన చప్పుడు).

కవి: (స్వగతం) అమ్మయ్య...ఎవరూ లేరు...నిశ్చింతగా పద్యాలు రాసుకోవచ్చు... ఈ దిక్కుమాలిన పేష్కరీ ఉద్యోగంచేసి బాగుపడ్డవాడెవడు. అంతకన్నా యీ ఊళ్లో అయ్యరగదగ్గర ఇడ్లెన్న పిండి రుబ్బే కామయ్య బాగపడ్డాడంటే తప్పేముంది! (గేటుదగ్గర చప్పుడు)...అబ్బా, మళ్లీ ఎవడో వచ్చాడు తుఫానులాగ (తలుపు తీసిన చప్పుడు)

వేణు: నాన్నగాలూ, నాన్నగాలూ!... మరేం...మరేమోనూ.. (కంగారుగా)

కవి: ఏమిటా నాన్నా, ఎక్కడికెళ్లావు? పరుగెత్తి పడ్డావా ఏమిటి? అలా ఒగురుస్తావేం!

వేణు: నాన్నారూ...నాకు డక్కిబండి కొనియ్యండీ (వీథిలో డక్కిబండి చప్పుడు) అదుగోనండి అబ్బి వచ్చాడు.

కవి: ఇప్పుడు కాదు, రేపుకొనిస్తా, నూకావారనుకుంటున్నను.. ఓ అబ్బీ, వెళ్లిపో. (బిగ్గరగా) అక్కర్లేదు.

వేణు: ఊఁ ఊఁ ...ఇప్పుడే కావాలీ... (బిక్కమొగం పెట్టి ఏడుపు లంకించుకుంటాడు.)

కవి: సరిగ్గా రాసుకునే సమయానికి వచ్చేడు పెంకి వెధవ. వీడు ఏడుపు ప్రారంభించాడంటే స్టేషన్‌లో రైలు కూసేవరకూ వదలడు......(బిగ్గరగా) అమ్మదగ్గిరికి పో...... వెధవ్వేషం వెయ్యనూ......ఇక్కడుమన్నావంటే తంతాను.

వేణు: ఇప్పుడే కొనియ్యండి నాన్నా... ...డక్కిబండి..... ఆఁ...(ఏడుస్తూ మారాం చేస్తాడు. కొడుకు ఏడుపు విని సూర్యలక్ష్మి చక్కావస్తుంది)

సూర్య: ఏమిటండీ పిల్లాణ్ణి అలా ఏడిపిస్తారు? పిల్లల్ని ఎలా ఊరుకోబెట్టాలో తెలీదు. బాబూ, నాదగ్గిరికి రా...... కుర్రాడిమీదా మీ కోపం.. ...పైగ కవిత్వాలూ, బల్లలు విరిగేలా ఉపన్యాసాలు చూడొస్తే జాస్తీ.

కవి: ఏం చెయ్యమన్నావు! రాసుకోనే సమయం కనిపెట్టి వస్తాడు పెంకి వెధవ.

సూర్య: ఊరికే నాడేం చేసేడని అలా కళ్ళెర్ర చేస్తారు! నాల్లెండి ఆరాగేమిటో, కట్టిపెట్టి ముందు భోజనానికి లేవండి, తరవాత బాగా రాసుకోవచ్చు......నేను అవక మంచి డక్కి బండి కొంటానులే రా వేణు.

కవి: వాణ్ణి ముందు లోపలికి తీసుకెళ్ళి నాకో చెంబుతో నీళ్ళు పట్టుకురా. (సూర్యలక్ష్మి లోపలికి వెళ్తుంది) (స్వగతం) అదిగో 12½ కూడా అయిఊరుకుంది. ఇంక రాసేదేమిటి! నా బొంద. పద్యాలు బుర్రలో పరుగులెడుతున్నాయిగాని, కాగితంమీద మాత్రము పడ్డంలేదు. ఓరి! భగవంతుడా!... (బరువుగా నిశ్వాసము) ఏమి అవస్థ తెచ్చిపెట్టావ్. సాయంత్రం పార్కుదగ్గర భారతీయులకు స్వాతంత్ర్యము సిద్ధించిన సందర్భంలో ఈ గ్రామవాసులు చేసే బహిరంగసభకు అధ్యక్షత వహిస్తానని అనాలోచితంగా మాట నిచ్చేను. తగినంత బందోబస్తు లేకుండా అక్కడ కెళ్లి ఏమి మాట్లాడను? (ఆలోచిస్తూ) ఆఁ...ఫరవాలేదు. ఏవో నాలుగు మాటలు వ్యంగ్యంగా విసిరేసేమంటే చాలు. గాంతోటి ప్రేక్షకులలోంచి కరతాళధ్వనులు ప్రతిధ్వనించవలసిందే. (గేటువద్ద చప్పుడు) నాలుగు మెతుకులు నోట పడేద్దామంటే మళ్ళీ ఎవడో సిద్ధం.

(స్వతంత్ర దినోత్సవ నిర్వాహక సభ్యుడు కవి దగ్గరకు వచ్చును.)

సభ్యుడు: కవిగారూ!..........నమస్తే.

కవి: ఏమోయి శాస్త్రీ! ఏమిటి విశేషాలు?

సభ్యుడు: మిమ్మల్ని త్వరగా భోజనంచేసి హైస్కూలు భవనానికి రమ్మని సభ్యులందరి తరఫున కోరుతున్నాను. సరిగ్గా 2 గంటలకి ఊళ్లో పెద్దలందరికి టీ-పార్టీ, బడిపిల్లలకి మిఠాయి పంపకము, తర్వాత పార్కులో సభాప్రారంభం జరుగుతుంది. కనక తమరు సిద్ధంగా వుండాలి. కారు పంపుతున్నా.

కవి: ఆఁ...ఇంతటి దానికి కారెందుకయ్యా!

సభ్యుడు: అదేమన్న మాటండోయ్. కవిగారూ!

కవి: సరే నీ యిష్టం. (లౌక్యంగా)

(లోపలినుంచి భోజనానికి రమ్మని కేక సన్నగా వినిపిస్తుంది)

సభ్యుడు: భోజనానికి వెళ్లండి......శెలవు మరి.

కవి: మంచిది.

3 వ దృశ్యం

[కవి భోజనంచేసివచ్చి పడకకుర్చీలో కూర్చుని ఉంటాడు. ఇంతలో వీథిలో కారు ఆగిన చప్పుడు]

కవి: కాసేపు పద్యాలు రాసుకోదామనుకైనా వ్యవధి లేకుండా అప్పుడే కారు వచ్చి కూచుంది. అక్కడికి వెడితే చీకటిపడేవరకూ ఎలాగూ రాలేం. వినా చెట్టుక్రింది న్యాయవాదిలా, నేనే దొరికాను యీ ఊరివాళ్ల కవిసన్మానానికి.. హ్హ హ్హ హ్హ........(ప్రకాశముగా) ఇదిగో చూడూ, లక్ష్మీ! చవ్వన తమలపాకులు చుట్టియ్యి.

సూర్య: ఇదిగో చుట్టే ఉంచాను.

(గడియారం రెండు కొడుతుంది)

కారుడ్రైవరు: (హారన్ కొడుతూ) అయ్యా, టైమైంది, రండిసార్.

[కవి కారెక్కుతాడు, చప్పుడు చేస్తూ కారు వెళ్లిపోతుంది]

... ...

[కారు హైస్కూలు భవనంముందు ఆగుతుంది. జమీందారుగారు, ఇంకా ఇతర సభ్యులు కవిగారిని ఆహ్వానించడానికి కారుదగ్గరకు వెడతారు]

జమీందారు: కవిగారూ, నమస్తే...... దయచేయండి.

కవి: (కారుతలుపు వేస్తూ దిగి) చిత్తం, చిత్తం......జమీందారుగారే స్వయంగా వచ్చేరు. నా అదృష్టం వేరే చెప్పాలా!

జమీం: ఆఁ, దానికేం లెండి.

కవి: ముఖస్తుతికి కాదండోయ్ నేనంటున్నది, క్షమించాలి.

జమీం: కాదు కాదు, ఎంతమాటన్నారు!

(18 వ పేజీ చూడుడు)

తాజ్‌మహల్ బీడీలు
వెనుకటి పేరు ప్రఖ్యాతులు కలిగినవి

ఇంకను సాటిలేనివిగాను శ్రేష్ఠమైనవిగాను వున్నవి. పనికిమాలిన నకలు బీడీలకు మోసపోవద్దు. వివరములకు: మాన్యుఫాక్చరర్లు:

మెసర్సు సయ్యద్ ఖాదర్,

వాషర్‌మన్‌పేట, : : మద్రాసు 21.

కవిరచించిన స్వతంత్ర గీతాలు

(11 వ పేజీ తరువాయి)

మీరు పెందలాడే వస్తారనుకున్నాం, ఆలస్యమైందేమిటండీ?

కవి అబ్బే ఏమీ లేదూ, కొంచెం లేటయిందండి......అంతే!

జమీం: అలాగా.........అంతా వచ్చేసేరు...లోపలికి రండి.

కవి: చిత్తం, పదండి.

(లోపల పిల్లలకి మిఠాయి పంచుతూ ఉంటారు. పిల్లల కేకలు వినిపిస్తూ ఉంటాయి. ఓప్రక్క ఊళ్ళోని పెద్దలకు అల్పాహారవిందు జరుగుతూ ఉంటుంది.)

ఓకుర్రవాడు: మేష్టారూ, నాకు బూందీ పెట్టండీ.

మరొకడు: నాకు లడ్డూ పెట్టరండీ?

మేష్టరు: మెదలకుండా కూర్చున్నవాళ్ళకే మిఠాయ్, లేకపోతే ఇదిగో పేకావారమ్మాయి.

ఇంకొకడు: వాడల్లరి చేస్తున్నాడండీ మేష్టారూ, వాడికన్నా నాకే ముందు పెట్టాలండీ!

... ...

కార్యదర్శి: కవిగారూ, టీపార్టీ పూర్తి అయింది. ఊళ్ళోని యావన్మంది జనం విచ్చేశారు. తమరు ముగింపుమాట లేవో రెండు చెప్పండి. జమీందారుగారు కూడా అలాగే శెలవిచ్చారు.

కవి. సరిసరీ, నన్నే చెప్పమన్నారూ... ఇంతమంది పెద్దలుండగా...సరే లెండి...... (వేదికమీదికి వచ్చి)—

మహాజనులారా! నమస్కారములు. సభ్యులందరి తరపున, శ్రీ శ్యామసుందరరావు బహద్దర్ జమీందారువారు, ఇంకా ఇతర పెద్దలందరి సమక్షమున అల్పుడనైన నేను రెండు వాక్యములు పలుక సాహసిస్తున్నాను.

'అయ్యా, నేటి అల్పాహార సమావేశము టీతో ముగించబడును. పదార్థము లెంతో రుచిగా ఉన్నాయి. దానికి శ్రీ జమీందారుగారు మిక్కిలి వందనీయులు. ఇంతకు మించి యిక్కడ విశదీకరించవలసిన విషయాలు లేవు. ఇప్పటికే కాలాతీత మైంది. తరువాత కార్యక్రమం పార్కులో వెంటనే ప్రారంభ మౌతుంది. విరమిద్దాం.

(కరతాళధ్వనులతో ముగుస్తుంది)

... ...

(ఊరంతా ఊరేగింపు ఉత్సవంలో పాల్గొంటారు. పార్కుదగ్గరకు జనం వరుసలుగా సాగిపోతూంటారు. మధ్యమధ్య 'స్వతంత్రభారత్‌కి జై, మహాత్మాగాంధీకి జై, పండిత నెహ్రూకు జై' అంటూ నినాదాలు వినిపిస్తూంటాయి. బాండు మొదలైన వాద్యాలూ, మందుసామాను ప్రేలుళ్ళు వినిపిస్తాయి.)

... ...

(పార్కులో, జనం కిక్కిరిసి ఉంటారు. వేదికపై కవి, జమీందారు చెరి ఒక కుర్చీలోను కూర్చుని ఉంటారు. సభాప్రారంభానికిముందు జమీందారు లేచి అధ్యక్షుణ్ణి ఎన్నుకుంటాడు.)

జమీం: (లేచి) సోదర సోదరీమణులారా! యీ నేటి సభకు అధ్యక్షుని ఎన్నుకోవలసి ఉన్నది కనుక పురజనులందరి కోరికపై శ్రీ కవిగారినే సభాధ్యక్షులుగా ఉండమని కోరుతున్నాను. (ప్రక్కకు తిరిగి) కార్యదర్శిగారూ, ఆ దండిలా ఇవ్వండి. కవిగారికి వేస్తాను. (కవి మెడలో దండ వేయును.)

(కరతాళధ్వనులు)

కవి: (లేచి) సోదరీ సోదరులారా! స్వతంత్ర భారతీయులారా!! దాస్యవిముక్తులారా!!! ఏదీ, ఒక్కసారి అనండి స్వతంత్రభారతికి జై! (అంతా జై అంటారు) ఈనాడు మనకు స్వాతంత్ర్యం సిద్ధించింది. శతాబ్దాల తరబడి తెల్లభూతాలు మన భారతావనిపై భీకరతాండవం చేశాయి......నిజమే, హంగుదార్లున్నంతసేపే తత్త తటికిట తోం మని గెంతొచ్చు—భామాకలాపంలో లాగ. కనక చెప్పొచ్చే దేమంటే యీవాళ మహాపుణ్యదినం. మన తాతలు, తండ్రులు చూడని స్వతంత్రభానూదయాన్ని మనం చూడగల్గినందుకు మన మెంతో గర్వించాలి. స్వాతంత్ర్యసమరంలో అనేకమంది వీరులు ప్రాణాలర్పించారు. అంతే బాగా నా చిన్నతనంలో లెండి. నాలాటి కవులెంతో మంది కంఠాలం చించుకున్నారు. తెల్లదొరలు మన వీరుల కత్తులూ, కవుల కలాలూ విరగ్గొట్టారు. ఇంక నేటితో వారిపీడ వదిలింది లెండి ......(గ్రామవాసులారా, మరొక్క విషయం: ఏమిటంటే ఇప్పుడు, అనగా ఈ రోజుల్లో కవులకు ఎంత అన్యాయం జరుగుతోందో ఆలోచించండి. అలా అన్యాయం జరగడంవల్లే కవిత్వం కూడా చెరుకు పిప్పిలా చవకైపోతోంది. అట్టి దుస్థితిని తొలగించడానికి మనం అంతా తీవ్ర కృషిచెయ్యాలి. కవులకు ప్రత్యేక సదుపాయాలు మన ప్రభుత్వం కల్పించేటట్టు చూడాలి. ఆనాడే మంచి కవిత్వం దేశంలో మొలకెత్తుతుంది. తీర్మానాలు తయారుచెయ్యాలి. ఏమంటారు? ఇన్నివేలమంది ప్రేక్షకులుండీ ఎవరూ మాట్లాడరేం? (వెంటనే ప్రేక్షకుల్లోంచి హియర్ హియర్‌లూ, కరతాళ ధ్వనులూ) బాబూ కార్యదర్శిగారూ, దస్తా తెల్ల కాగితాలు సిద్ధంచెయ్యండి. ముందర ఆ ప్రయివేటురూములోకి పదండి, చెబుతాను. (ఇద్దరూ ప్రయివేటు రూములోకి వెడతారు)

కార్య: ఇవిగో, కాగితాలు సిద్ధంగానే ఉన్నాయండి. అవునుగాని అప్పుడే ఉపన్యాసం ఆపుచేశారేమిటండీ? ఇంకెవరూ లేరు. సాయంత్రం దాకా మీరే మాట్లాడాలి.

కవి: (రహస్యంగా) అమ్మయ్యో, నేను మాత్రం యింక మాట్లాడను. అయినా అన్ని విషయాలూ విపులంగా మాట్లాడేశానే. అందులోనూ నేనంతా లిమిటెడ్ (limited) గా ఉంటానండి. ఆవిషయం మీకు బాగా తెలిసినదే, మళ్ళీ ఇప్పుడు చెప్పాలా?

కార్య: ఎలాగండీ సభంతా అల్లరయిపోదూ! ఇంతమంది ప్రేక్షకుల్ని ఊరికే పొమ్మంటే ఏం బాగుంటుందో ఆలోచించండి. మైక్ అవీ పెట్టి ఆడావిడిచేశాం. చందాలిచ్చిన వాళ్ళంతా ఊరుకుంటారుటండీ?

కవి: ఊరుకోకపోతే ఉరెట్టుకుంటారుటండీ? ..... ఐతే నేనొక ఉపాయం చెబుతా, అలా చెయ్యండి. ఏమంటే, కవిగారికి ఒంట్లో బాగా లేకపోవడంవల్ల ఇంతటితో సభ ముగిసిందని చెప్పెయ్యండి. ముసుగెట్టుకొని మూలుగుతూ పడుకుంటాను. త్వరగా వెళ్ళి నేను చెప్పినట్లు చెయ్యండి. (కాస్సేపు మూలుగుతాడు)

కార్య: (సభావేదికమీదికి వచ్చి) సోదరులారా, అంతా నిశ్శబ్దంగా ఉండి, నేను మనవి చేసే రెండు మాటలు విన ప్రార్థన కవిగారికి ఒంట్లో అస్వస్థతగా ఉండడమువల్లనూ, వక్తలింకెవరూ లేని కారణంచేతనూ ఈ సభాకార్యక్రమము ఇంతటితో ముగుస్తుంది. వచ్చే ఆగస్టు 15 బాగా జరుపుకుందాం. ఇప్పట్నుంచీ విరివిగా విరాళాలు వసూలు చెయ్యండి. జై! స్వతంత్ర భారత్‌కి జై!

(అంతా, సభ తొందరగా ముగియడంవల్ల నిరుత్సాహంతో గోలచేస్తూ వెళ్ళిపోతారు)

4 వ దృశ్యం

[కవి ఇంటిదగ్గర, సూర్యలక్ష్మి ప్రక్కింటావిడతో డాబామీద కూర్చుని మాట్లాడుతూ ఉంటుంది.]

సూర్య: రాశమ్మా వసంతా......ఇంట్లో లేరులే, ఇంకా రారు......కూచో.

వసంత: ఇంకా పొయ్యిలో నిప్పు రాజేసుకోలేదు, పోతాను.

సూర్య: కూర్చుందూ, మరేం ఫరవాలేదు. విశేషాలేమిటో?

వసంత: ఏమున్నాయ్ విశేషాలు...ఈ సంగతి విన్నావా, అగ్రహారంలో సుబ్బయ్య శాస్త్రిలుగారి పెద్దకూతురు ఎవడో జోతిష్కుడితో లేచిపోయిందిట!

సూర్య: ఆ మొగుడుపోయిన పిల్లే!... అదెప్పుడు?

వసంత: ఈమధ్యనే, పదిరోజులయిందో లేదో...ఆ ముసలాడు నలుగురినోటా పడ్డాడు.

సూర్య: పాపం, ఇంతకీ చేసుకున్న కర్మ అనుభవించాలికుమా!

వసంత: అన్నట్టు, మీ ఆయనకూడా పార్కులో మీటింగుకి వెళ్ళారా? అడగటం మరచాను.

సూర్య: ఏమో ఎక్కడి కెళ్ళారో గాని, చీకటిపడినా యింకా రాలేదు.

వసంత ఇవాళ మనకి స్వాతంత్ర్యం వచ్చింది తెలుసునా సూర్యలక్ష్మీ? ఊరంతా ఉత్సవాలూ, ఊరేగింపులూ మరెందు కనుకున్నావు?

సూర్య: అవునట, మా ఆయనకూడా చెప్పారు. అయితే ఇప్పుడున్న రాజు పోతాడంటావా?

వసంత. ఎక్కడికి పోతాడు ఏట్లో?, మసిపూసి మాయచెయ్యాలని చూస్తున్నాడంటారు కొందరు. ఏమవుతుందో చివరికి.

సూర్య: ఆఁ, ఇంతవరకూ వచ్చాక మాయచేస్తే ఊరుకుంటారా మన నాయకులు!

వసంత: ఏమో, ఏం జరుగుతుందోకాని, ఓప్రక్క తురకోళ్లు మనమీద తిరగబడుతున్నారు. దేశమంతా రక్తపాతమై ఎవరో పెద్దవాళ్ళు చావడానికే వచ్చిందిదంటాను. కూటికీ గుడ్డకీ మరింత కరువు వచ్చేలా ఉంది. నవఖాలీ దురంతాలింకా నా కళ్ళల్లో నాట్యం చేస్తున్నాయి.

సూర్య వసంతా! ఇవన్నీ ఎవరు చెప్పారునీకు?

వసంత: మా యింట్లో రేడియో ఉందిగా, ఏ నిమిషానికానిమిషం వార్తలు తెలుస్తూ ఉంటాయి. నీవుకూడా రోజూ రేడియో వినడానికి రారాదూ?

సూర్య: నాకేం తెలుస్తుంది రేడియో. నేనేం చదువుకోలేదు ఇంగ్లీషు. నువ్వంటే చదివావు మరి మెట్రిక్లేషనో ఏదో.

వసంత: ఒక్క ఇంగ్లీషే ఉండదు. అన్ని భాషల్లోను వార్తలు వస్తాయి. ఎంత చదివితే మాత్రం ఇంట్లో పన్లు తప్పుతాయా, ఏమో అంటావుగాని.

సూర్య: మీ ఆయనకేం ప్లీడరీ చేస్తున్నారు. బాగా నౌకర్లని పెడతారులే. నీ కేం లోటు?

వసం: మీ ఆయన కమ్మగా కవిత్వం చేస్తున్నారుగా. (ఎటకారంగా)

సూర్య: ఏమిటో, కవిత్వం చేస్తే కానిడబ్బులన్నా కిట్టవు...పోనిస్తూ, ఎందుకొచ్చిందీ.

వసం: ఆ వచ్చేది మీవారులా ఉంది...... అడుగో మీ వేణు. వెడతా, తప్పకుండా రా.

సూర్య అలాగేలే. (వసంత వెళుతుంది)

(కవి కొడుకుతో ప్రవేశిస్తాడు)

వేణు: (పరిగెత్తుకు తల్లి దగ్గరకు వచ్చి) అమ్మోయ్, నాన్నగారొచ్చారేవ్, మంచినీల్లు కావాలిత, ఇవ్వు. (ముద్దులొలికేలా మాట్లాడుతాడు)

సూర్య: (భర్తకు గ్లాసుతో నీళ్లు యిస్తూ) ఇంత చీకటిపడేవరకూ ఎక్కడున్నారు? ఇంట్లో ఒక్కగ్తనూ ఏమైపోయినా మీ కక్కర్లేదు కాబోలు. కానివ్వండి, నే చేసుకున్న కర్మ యిదంతాను. (అంటూ కొడుకుని దగ్గరకు తీసుకుంటుంది.)

కవి: ఎవత్తె బోధించింది నీకీ వేదాంతం. కర్మంటావు, కర్మా గిర్మాను.

సూర్య: మీ కా కవిత్వం ఎవరు నేర్పారు? దానివల్ల సంపాదన చూస్తే శూన్యం. (దిగులుగా)

కవి: కవిత్వం ఒకడు నేర్పేదేమిటి, దానంతటదే మెరుపులా చక్కా వస్తూంటుంది కొంతమందికి. అదీ కాకుండా "కవనం పురుషలక్షణమ్, స్త్రీణామపి ఆహారపచనం శ్లాఘనీయ మిత్యుచ్యతే బహుభిః పండితైః" అన్నాడు నూతుడంతటి వాడుకూడా, నీకేం తెలుసు నీ మొహం.

సూర్య: అదేమిటండీ, భుజం మీద కొత్త కండువాలా ఉంది. (మందస్మితంగా)

కవి ఆఁ, మరేమనుకున్నావ్! సన్మానం చేసి జరీశాలువా కప్పారు. మన ఉపన్యాస ధాటికి ఊపిపడిందీ బహుమతి.

సూర్య. అవును లెండి, మీరు యీవాళ ఏదో పద్యాలు రాసుకుని తరించాలన్నారు. రాశారా?

కవి: ఆఁ...(ఆశ్చర్యంతో) అయ్యయ్యో.. జ్ఞాపకంవచ్చింది. పద్యాలూ లేవు, నా బుర్రా లేదు. శెలవురోజుల్లోనే రాయలేక పోయాను. బడిరోజుల్లో వేరే చెప్పాలా! ఎన్నో రాయాలనుకున్నాను. తినడం తిరగడం పడుకోవడం లేవడం పోవడాలతో సరిపోతుంది. ఇదా నానిత్యజీవితం! ...ఊఁ, (అంటూ నిట్టూరుస్తాడు).

సూర్య: భోజనానికి లేవండి. (దూరంనుంచి వినిపిస్తుంది).

వేణు: నాన్నగారూ, అమ్మ బువ్వకి రమ్మంటోంది.

మొదటి పుట్టిన రోజు

(15-వ పేజీ తరువాయి)

ప్రణాళిక ఉద్యోగాలకు మాత్రమే వర్తించేది. అది ఇప్పుడు విద్యాసంస్థలకుగూడ అన్వయమవుతున్నది. రానురాను చావుపుటకలకు గూడ చెలామణి కావటానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు వినికిడి, ఈవిషయంలో కేంద్ర ప్రభుత్వం మాటను ధిక్కరించటానికైనా సంసిద్ధులైనట్లు కనబడుతుంది. ఇది ఇట్లా ఉండగా రాష్ట్రభాషగా నిర్ణయమయిన హిందీని దొడ్డిదోవన బయటికి తరుముతున్నారు. వీలైన చోట్లలో ప్రాంతీయభాష తమిళంగా నెలకొల్పటానికి అన్నివిధాలా సాహసిస్తున్నారు. ఇదంతా చూడగా దాక్షిణాత్యులు అమెరికాదేశంలో మాదిరి కేంద్రప్రభుత్వాన్ని ప్రతిఘటించటానికి సంసిద్ధులవుతున్నట్లు తోస్తుంది. ఆ బ్రహాం లింకన్ పాత్రను నెహ్రూ పండితుడో, పటేల్ సర్దారుడో ధరించవలసిన పరిస్థితులు ఏర్పడక తప్పట్లు లేదు.

పోలీసుల జులుం ఏవిధంగానూ మారలేదు. ఇంగ్లండు అమెరికాదేశాలలోవలె ప్రజలతో వాళ్ళు కలసిమెలసి స్నేహభావంతో మెలగే కాలం ఇప్పట్లో సిద్ధించేట్లు తోచదు. ప్రజలను భయపెట్టటంతప్ప రక్షకభారం వహిస్తున్నట్లు ఎక్కడా కనబడదు. ఇతరశాఖలలో మామూళ్లు పుచ్చుకున్నే ఆచారం అంతరించలేదు. దీనికి తోడుగ రాష్ట్రప్రభుత్వంలో పలుకుబడి ఉన్న ప్రముఖులు ప్రతిఊరులోనూ పరిపాలనలో జోక్యం కలుగచేసుకుంటున్నారు. ఒక్కొక్క జిల్లాలో మంజూరైన పర్మిట్ల భోగట్టాను పరిశీలించి చూస్తే ఆశ్చర్యమవుతుంది.

ఈ ప్రథమ స్వాతంత్ర్యదిన వార్షికోత్సవం ఈ పరిస్థితులలో జరుపుకోవలసివచ్చింది. 'ఆడంబరంతో' జరుపుకునేందుకు తగిన వాతావరణంగాని, ఉత్సాహంగాని ప్రస్తుతం లేదు. వచ్చే నాటికైనా అనువైన విధంగా సంతోషంతో గడుపుకునే సందర్భాలు ఏర్పడగలవని ఆశింతాం. జై హింద్!

భవిష్యద్వాణి

నీ విషయమై 1948 సం॥లో ఏమి జరుగబోవును?

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ నీ సరియైన చర్య గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే, ఒక పోస్టుకార్డుపైని నీ కిష్టమగు ఒక పుష్పము పేరున్నూ నీవు వ్రాయు తేదీ వేళ వివరమున్నూ నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసిపంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్యగణిత మూలముగా మేము గుణించి, నీవు కార్డు వ్రాసిన తేదిలగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగును, నీ ఉద్యోగము విషయములో మంచి చెడ్డలు మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము, మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి.పి.గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకము). దుష్టగ్రహము లేవైన ఉన్నయెడల శాంతిచేయు విధానము కూడా తెలుపుడుచేయడమగును. వివరములు మా సూచీపైని పంపబడును. మేము పంపిన భోగట్టా నీకు తృప్తిగానుండని యెడల, పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు.

పండిట్ దేవదత్ శాస్త్రి, రాజజ్యోతిషి,
(ఎ, బి. ఎం.) కర్తర్‌పూర్ (ఇ. పి.)

Pt. DEV DUTT SHASHTRI, RAJ JYOTISHI,
(A. B. M.) KARTARPUR (E. P.)